

# ఖరీదు

తెళ్లపల్లి వెంకట లక్ష్మీనారాయణ శర్మ

ఒక వ్యక్తి స్వభావాన్ని చిటికెలో తెల్సుకోవాలంటే డబ్బుపట్ల ఆ వ్యక్తి యొక్క దృక్పథాన్ని బట్టి తెల్సుకోవచ్చునన్నది నాకున్న గట్టి విశ్వాసాల్లో వకటి. నా జీవితంలో తీసుకున్న నిర్ణయాలు చాలామటుకు యీ సిద్ధాంతం ద్వారా తీసుకున్నవే.

ఇప్పుడు మా మూడో అబ్బాయికి వివాహం చెయ్యాలని తలపెట్టాను. వాడు బొంబాయిలో వుంటున్నాడు. నెలకో వెయ్యి రూపాయలకు పైనే సంపాదిస్తున్నాడు. ఇది గొప్పలు చెప్పుకోటానికి చెప్పిందికాదు. ఎందుకంటే యీ రోజుల్లో వెయ్యి రూపాయల జీతం పెద్ద జీతం అని నేననుకోను. వాడి వివాహ ప్రసక్తి వచ్చింది కాబట్టి యీ సంగతి చెప్పాను. మొదట్లో సంబంధాలు చూసేటప్పుడు యీ విషయం చెప్పేవాణ్ణి కాదు. "చెవులో

గేచెనుపెట్టి...." అన్నట్టుగా వుండే వ్యవహారం అని యెగతాళి చేసేవాళ్ళు. ఆడపిల్లల తండ్రులు (ముఖ్యంగా తల్లులు) మొట్టమొదటగా నన్నడిగిన ప్రశ్న యిదేకావటంవల్ల తర్వాత్తర్వాత యెవ్వరూ అడక్కుండానే చెప్పటం అలవాటు చేసుకున్నాను. మా వాడు వుద్యోగంలో చేరి దాదాపు నాలుగేళ్ళవుతోంది. ఆ మధ్యవరకూ "మీకు సంబంధాలు చూస్తున్నాం" అని వ్రాస్తే "అలాంటి ప్రయత్నాలేం చెయ్యొద్ద"ని ఎక్స్‌ప్రెస్ డెలివరీ లెటరు వ్రాస్తూ వుండేవాడు. కానీ రెండు నెలల క్రితం అలాంటి వుత్తరం నేనొకటి వ్రాస్తే తాపీగా ఓ పదిరోజులకి "మీ వుత్తరం అందింది" అంటూ మాత్రమే వ్రాశాడు; వివరాల జోలికేం పోలేదు. వీడికో సంబంధం త్వరలోనే ఖాయం చేయాలన్న నిర్ణయానికొచ్చాను నేను జాప్యం చేస్తే బొంబాయిలో వాడేం తొందర పడ్తాడేమోనన్న అనుమానం వచ్చి వెంటనే సంబంధాలు చూడటం మొదలు పెట్టాను. వాడు తొందర పడటంలాంటి దేమన్నా జరిగితే యింకేమన్నా వుందీ!? నేనింకో ఆడపిల్ల పెళ్ళి చెయ్యాలి. ఎంతకాలం "మావాడు చెల్లెలి పెళ్ళి అయ్యేంత వరకూ పెళ్ళి మానేస్తాడ"ని చెప్పుకుంటూ రావటం! వాడే అమెరికాలోనో వుంటే అది వేరే మాట; అప్పుడు చిక్కేలేదు!!

ఇప్పటికే నేను జాప్యం చేశానా అన్న అనుమానం వచ్చి "నువ్వేం తొందర పడవద్ద"ని వ్రాయటం యెలానో తెలియక "రెండు మూడు సంబంధాలు చూస్తున్నాను .... నువ్వొచ్చి పిల్లలను చూసుకుందువు గాని .... సెలవు సంపాదించే ప్రయత్నంలో వుండమ"ని వ్రాశాను. తన సెలవంతా యింకొక రెండు నెలల్లోపునే ఖర్చు చేసేసుకోవాలని జవాబొచ్చింది. సంబంధాలు చూడటం వెంటనే మొదలు పెట్టాను.

వివాహవిషయంలో—మగపిల్లవాడివి గానీండి ఆడపిల్లది గానీండి—అవతలి వైపువాళ్ళ డబ్బు, హోదా చూడటం సామాన్యంగా జరుగుతున్న పని. నేను మాత్రం యిందుకు భిన్నంగా వెళుతున్నానని మా మిత్రులు నామీదో అపవాదు లేవదీశారు. "వాడి ఖర్మ" అనికూడా అన్నారు. మనుష్యులను అంచనా వెయ్యటానికి నేనుపయోగించే కొలమానం ప్రకారం నేనెన్నుకునే మనిషి బీదవాడూ, ధనికుడూ అయ్యుండాలనే 'రూలు' లేదు అలా అంటే యెవ్వరూ ఒప్పుకోలేదు. ఈ విషయాన్నే మరోవిధంగా చెప్పాలనే ఉద్దేశ్యంతో "నేను మనిషికి విలువకట్టే ప్రయత్నంలో ఉపయోగించే పద్ధతికి డబ్బు ప్రమేయం లేనేలేదు; మరి ఆ విధంగా యెన్నుకునే వ్యక్తుల ఆర్థిక పరిస్థితి గురించి మీ రెందుకొక నిర్ణయానికొస్తారో అర్థం కావటంలేదు" అని మొత్తుకునేవాణ్ణి.

[illegible] లేదుట" అని వాళ్లల్లో వాళ్లనుకుని 'యిదేం మనిషి!!' అన్న భావం వ్యక్తం చేసే ఆశ్చర్యాన్ని ప్రకటించేవాళ్లు.

"అర్థంలేకుండా మాట్లాడేది నువ్వే" అన్న అర్థంలో నవ్వేవాళ్లు. మొత్తానికి నేను వుపయోగించే విధానంలో నమ్మకం వుండేది కాదెవ్వరికీ.

మా ఆవిడే అనేది — "ఇడిగో ... మీరు యెన్నిక జేసుకునే మనుష్యులు.... అడిగో...ఆ లక్షింపతిలాగానే వుంటారు" అని. మా ఆవిడకు చెయ్యి త్రిప్పుతూ మాట్లాట్టం అలవాటు. ఆ చెయ్యి కదలికకూ, మాటవరసకూ యేవో అవినాభావ సంబంధం వుంది.

"ఈ మనిషి చేతులు వెనక్కి కట్టేస్తే మాట్లాడ గలుగుతుందా" అనిపిస్తుంది మా ఆవిడ మాట్లాడేటప్పుడల్లా! మాట్లాడేటప్పుడు చేసే చేతి కదలికలో ఒక క్రమం కనిపిస్తుంది. చేతివ్రేళ్లు అరచేయి పైకి కనిపించే విధంగా నేలకు ఆంటుకునో, లేదా నేలవైపు చూపిస్తూనో వుంటే "ఇడిగో" అంటుంది; చేయి నేలకు పైగా కుడివేపుకో, ఎడంవేపుకో వెడితే "అడిగో" అంటుంది. మా ఆవిడ యెదురుగా కూర్చుని కబుర్లు చెపుతుంటే "సోది అమ్మ" మనముందు కూర్చున్నట్టే వుంటుంది; పైగా తను చెప్పేదికూడా అదే!!

ఇంతకూ "లక్షింపతి" గా మారిన [illegible] పతి ఆంధ్రదేశంలో ప్రొహిబిషన్ తీసివెయ్యకముందునుంచీ కూడా త్రాగుతూనే వున్నాడు. అతగాణ్ణందుకే పరువుతక్కువవాడన్నారు. మనిషిని అంచనా వెయ్యటానికి యీ కాలమానం వుపయోగించే వారి దృష్టిలో లక్ష్మీపతి చెడ్డవాడు కావచ్చు .... నేనూ ఒప్పుకుంటాను. నేను వుపయోగించే విధానాన్నే అందరూ వుపయోగించాలని నేను పట్టుబట్టను. కానీ మనిషి నిజస్వరూపం తెల్సుకోవటంలో మిగతా విధానాలకంటే నేను వుపయోగించేది వుత్తమమైనదనుకుంటాను; అది నా విశ్వాసం. ఇక లక్ష్మీపతి విషయంలో అతనికున్న త్రాగుడు అలవాటుని అతని బలహీనతగానే నేను తీసుకుంటాను. అతని ఆ అలవాటువల్ల యితరులకు హాని జరుగుతుందని నేననుకోను. ఈ అలవాటు వున్నందువల్లనే లక్ష్మీపతి వుత్తముడు కాడనీ, అది లేనందువల్ల మా ప్రక్కయింటిలో వుంటున్న శంకరశాస్త్రి వుత్తముడనీ నేననలేను. ఎవరన్నా అంటే వొప్పుకోనుకూడాను.

శంకరశాస్త్రి మడి, జపం వగైరాలతో నిష్టనియమాలు కల్గినవాడు. ఆఫీసులో "పైపాటు" పడుతూవుంటాడని అం[illegible] రకూ తెల్సు. అందుకనే వున్నవూళ్లో వుండనీయకుండా అతగాణ్ణి వూళ్ళవెం[illegible] ట్రాన్సుఫర్లంటూ త్రిప్పుతున్నారన్న

సంగతి జగద్విదితం. ఇలాంటి శంకర శాస్త్రిని లక్ష్మీపతికంటె ఉన్నతస్థానంలో యేవిధంగా వుంచాలో నాకర్థంకాదు. అందుకే లక్ష్మీపతి యింటికే నేనెక్కువ రాకపోకలు చేస్తూవుంటాను: అతగాడినే మాయింటికి పిలుస్తూవుంటాను.


ఒకసారి మా వీధిలో ఒక సంఘటన జరిగింది. దానిని గురించి నేను తర్వాత విన్నాను. మా వీధిలోని అయిదాళ్ళలో "రత్తాలు" పనిచేస్తూ వుంటుంది. 'రత్తాలు' పూర్తి పేరేమిటో నాకు తెలియదు. అసలు పేరు అదికాదని మాత్రం నేను చెప్పగలను. తన అసలు పేరేమిటో "రత్తాలు" కూడా బహుశః తెలియకపోవచ్చు. పేరు నిలబెట్టుకోవటానికి కూడా ఆర్థికస్తోమత కావాలేమో! బాగా డబ్బుంటే 'రత్నాదేవి' అని పిలుస్తారు. ఇక మధ్యతరగతికొస్తే వయస్సునుబట్టి పేరులో కొన్ని చిన్నమార్పులొచ్చినా 'రత్తమ్మ' అన్నపేరు శాశ్వతంగా నిలిచి తీరుతుంది. పై తరగతిలో మాత్రం పేరు మీద వయస్సు ప్రభావం వుండదు. అలాగే క్రింది తరగతిలో కూడాను. 'రత్తాలు' అన్నపేరు పుట్టినదగ్గర్నుంచి వచ్చేంతవరకూ వుంటుంది. ఆర్థికస్తోమత వున్నవాళ్ళని పేరున్నవాళ్ళని అందుకే అంటారేమో ననిపిస్తుంది నాకు. వాళ్ళ పేర్లు అలాగే వుండిపోతాయి మరి; వాటి నెవ్వరూ మార్చలేరు.

ఆ రోజున రత్తాలు తన కూతుర్ని వీధి పంపుదగ్గర దింపి యే యింట్లోనో పనిజేస్తోంది. ఇంతలో ఆవొకటి పరుగెత్తుకుంటూ వచ్చి పిల్ల పొట్టమీద త్రొక్కుకుంటూ పోయింది. అంతవరకూ 'ఛయ్. ఛయ్' అంటూ వీధి వాకిలిదగ్గిరున్న శంకర శాస్త్రి యిది చూసి జపం చేసుకోవటానికి యింట్లోకెళ్లిపోయాడు. దూరంగా సిగరెట్టు కాల్చుకుంటూ కూర్చున్న లక్ష్మీపతి పరిగెత్తుకుంటూ వచ్చి, ఆ పిల్లని హాస్పిటల్‌కు వేసుకెళ్లి పన్నెండింటిదాకా అక్కడే వుండి, ఖర్చులన్నీ తనే పెట్టుకుని యింటికి తిరిగొస్తూ దగ్గరుంచుకోమని కొంత డబ్బు రత్తాలు భర్తకిచ్చి వచ్చాడు. రత్తాలు భర్త లక్ష్మీపతికి చెమ్మెత్తి దండం పెట్టివుండాలి. అతగాడు దేవుడే తిరుపతికోనో వున్నాడంటే నమ్మనే నమ్మడు. ఆ సంగతే నేను ఒక సాయంకాలం శంకరశాస్త్రి యెక్కడో కదిపితే అన్నాను—

"లక్ష్మీపతి నిజంగా దేవుడులాంటి వాడ"ని.

శంకరశాస్త్రి నవ్వాడు. నాకు వంటి మీద పురుగులు ప్రాకినట్లనిపించింది. శంకరశాస్త్రి నవ్వుతూనే—

"మీ రమాయకులు మూర్తిగారూ! లక్ష్మీపతి సామాన్యుడా యేం?! ఊరికే యిచ్చాడనుకున్నారా?! 'లక్ష్మీపతి— రత్తాలు వ్యవహారం....'" అంటూ అర్థోక్తిలో ఆపి అర్ధవృత్తాకారంలో తల త్రిప్పుతూ కనుబొమలు పైకెగరవేశాడు.




"ఈ విషయం రత్తాయి భర్తకి తెలిస్తే ప్రాణాలు తీస్తాడు" అన్నాను.

"తియ్యడూ మరి! లక్ష్మీపతి ఆ జాగ్రత్త తీసుకుంటూనే వున్నాడు" అన్నాడు.

నాకు వళ్ళు మండిపోయింది.

"నేను చెప్పేది లక్ష్మీపతి గురించి కాదు; మీ గురించి. మీరిట్లా మాట్లాడుతున్నారని వీరయ్యకు తెలిస్తే మీ ప్రాణానికే మోసం" అన్నాను.

శంకరశాస్త్రి గతుక్కుమంటూ——

"ఆఁ .... మీరూ, నేనూ వాడ్డగ్గర అనొచ్చామా యేం' అన్నాడు. ఆ మాటలో "మీరీ సంగతి వాడితో చెపుతారా యేం కొంపతీసి" అన్న భయం వుంది. చెవిలోని పువ్వు పరిజేసుకుంటూ చకచక నడుచుకుంటూ వెళ్ళిపోయాడు శంకరశాస్త్రి.

ఆ పసిపిల్లనా పరిస్థితిలో చూసిన శంకరశాస్త్రి మనసెట్లా పనిచేసిందో నేనూహించగలను. "అయ్యో పాపం!" అని అనుకుని వుండడని నే ననను. నా దృష్టిలో శంకరశాస్త్రి రాక్షసుడు కాదు. ఆ పరిస్థితుల్లో అక్కడ వుండే హాస్పిటల్‌కు తీసుకుని వెళ్లాల్సి వస్తుందని తెల్సు. అందుకయ్యే ఖర్చు వీరయ్య తిరిగి యిచ్చుకునే స్థితిలో లేడు. మహా అయితే ఓ పదిదండాలు పెడతాడు. దండం ముడితే డబ్బు ముట్టినట్టు కాదు కదా? ఎందుకీ బాదరబందీ అని నూతి వేపు స్నానం చెయ్యటానికి వెళ్లి వుంటాడు. ఇక్కడే నేను లక్ష్మీపతిని.

శంకరశాస్త్రిని విభజించే గీత గీచాను. ఇది మనిషి మనుగడకీ, మానవత్వానికీ గీటురాయి. మానవత్వాన్ని మించిన విష్యాలూ, నియమాలూ వున్నయ్యన్నది నా నమ్మకం కాదు.

ఇలాంటి విషయా లనేకం చూసిన తర్వాతే నా విధానాలపట్ల నాకు నమ్మకం యేర్పడింది. అవి నాలో బాగా పాతుకు పోయినయ్.

గుంటూర్లో ఓ రెండు సంబంధా లున్నయ్యని తెలిసి, విచారించి పద్దామని నేనే వెళ్లాను మరేదో పనిమీద గుంటూరు వెళ్ళి.

"ఇదిగో....మీ గీటురాళ్లూ, శంకర రాళ్లూ అంటూ యేదో బికారి సంబంధం తీసుకురాకండి. వాడి వుద్యోగం.... అదిగో....వాడి హోదాకి తగిన సంబంధం అయ్యేట్టుగా చూడండి" అంది మా ఆవిడ.

"నేను అనుసరించే విధానంలో డబ్బు ప్రసక్తే లేదు. మరి ఆ విధానం ప్రకారం యెన్నుకున్నవాళ్లు బికారులో, ధనికులో నువ్వెట్లా తేల్చగలవ్" అన్నాను.

"తేల్చేందుకేముంది!! ....డబ్బంటే (ఇదిగో) నిర్లక్ష్యంగా వుండేవాళ్ళందరూ మీకు మంచివాళ్లేగా!....(అదిగో)...." అంది.

"నా విధానంలో డబ్బుపట్ల నిర్లక్ష్యం అన్న ప్రసక్తే లేదు. జీవితంలో వాళ్ళ లక్ష్యమేమిటో అనే నేను తెల్సుకునేది" అన్నాను.

"మీర్చెప్పేదేమిటో మీకే అర్థంగాదు; యింకా మిగతావాళ్ళకేం అర్థమవుతుంది!! ....(ఇదిగో) పిల్లమాత్రం చదువుకుని. (అదిగో) అందంగా వుండాలి" అన్నది.

తనకు తెలియని విషయం మరెవ్వరకూ తెలియదన్న భరోసా మా ఆవిడకుంది. ఒకవేళ అలా తనకు తెలియని మరొకరికి తెలిసిన విషయం అంటూ వున్నా, అది తెలివైన విషయం కాదన్న నమ్మకం కూడా ఆవిడకుంది. తెలివి తక్కువ విషయాన్ని గురించి పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నట్టుగా సంభాషణ మార్చివేస్తుంది. అది తెలివితక్కువతనం అని సంపెట్టుకుంటూ వుంటాను. గత్యంతరం లేదు మరి; నూటికి తొంభై మంది ఆడవాళ్ళంతే.

గుంటూరు చేరుకున్నాను. నా బాల్య మిత్రుడు సుబ్రహ్మణ్యాన్ని తీసుకుని బ్రాడీపేట బయల్దేరాను. సుబ్రహ్మణ్యం దారిలో వివరాలన్నీ చెప్పాడు. పిల్లకు తండ్రి లేడు. ఇక్కడ తల్లి అజమాయిషీ లోనే వుంటోంది. ఇద్దరో ముగ్గురో అన్నగార్లున్నారుట; అందులో పెద్దాయన పెంపకాని కెళ్ళాట్ట. ఆ తర్వా తేమేమిటో చెబుతూనేవున్నాడు గానీ నేను వినలేదు. ఒక గమ్యాన్ని చేరుకోటానికి అనేక త్రోవలగుండా వెళ్ళగలిగినట్లే, ఒక విషయాన్ని తెల్సుకునేందుకు అనేక పద్ధతులుపయోగించవచ్చు. స్థూలంగా నేను

తెల్సుకోదలచింది యిది — నేను వెళ్ళి చూడబోయే వ్యక్తులు మనిషిగా బ్రతకటం పట్ల యెంత విలువనిస్తారు? డబ్బు విషయం వచ్చేసరికి యీ విలువల విలువ యెంత వుంటుంది? ఒకరికి మనిషిగా నేనిచ్చే విలువ వారిలోని మానవత్వం, మానవ సహజమైన ప్రేమానురాగాలమీద ఆధారపడి వుంటుంది. ఈ సంగతి యెలా తెల్సుకోవటమా అని ఆలోచిస్తున్న నాకు ఆ కుటుంబంలో దత్తుకెళ్ళిన కుర్రాడున్నాడనేసరికి నా విధానాలు వీళ్ళ విషయంలో సక్రమమైన ఫలితాలిస్తాయనే అనిపించింది. సుబ్రహ్మణ్యాన్ని ప్రక్కనేవున్న హోటల్లోకి తీసుకువెళ్ళి వివరాలన్నీ సేకరించాను. దత్తతకు వెళ్ళిన యీ కుర్రాడి తండ్రి బ్రతికివున్న రోజుల్లో యితగాణ్ణి పెంపకానికి పంపేందుకు చాలా ప్రయాసపడ్డాడుట. ఇతగాడి జాతకంలో యేవేవో మార్పులుచేసి. కుదురు మారితే గానీ యితగాడి ఆయుష్షు పెరగదని నలుగురికీ చెప్పి కుర్రవాడిని పెంపకానికి పంపించాట్ట. పెంపకం పుణ్యమా అని అతగాడూ బాగుపడ్డాడు; ఇటు వీళ్ళూ కొంచెం బాగుపడ్డారు.

ఈ వివరాలు విన్నతర్వాత నేనుద్దేశించిన పంథాలో వెళ్ళటంవల్ల సరయిన ఫలితాలొస్తాయనే నమ్మకం కుదిరింది.

వారింటికి చేరుకున్నాం. అవీ యివీ మాట్లాడాక పిల్ల తల్లి అన్నది — 'ఎంతలో వున్నారు మీరు?' అని.

బహుశః కట్నంగురించి ఆయుంటుందనుకున్నాను. ఇక్కడొక విషయం తమతో చెప్పుకోవాలి. నేను కట్నం గురించి యీ మధ్యవర్తితో చెప్పలేదు. అలాగని అక్కర్లేదని చెప్పానని బడాయి చెప్పుకోను మీతో. దీన్ని గురించి చెప్పాల్సిన అవసరమేమీ కనిపించక నేనే మీ యీ మధ్యవర్తితో చెప్పలేదు కానీ ఆవిడ తనంత తానే యీ ప్రసంగం తెచ్చేసరికి యీ విషయంలో నా వుద్దేశ్యాలేమిటో చెప్పకుండా యీ విషయాన్నికూడా నేననుసరించే విధానంలో ఒక భాగంగా వుపయోగించుకోవాలని —

'ఎంతలో వున్నారు మీరు?' అన్నాను.

'పిల్లవాడిని బట్టివుంటుంది. వెనకాల ఆస్తి సంపాదన....' అంటూ మొదలెట్టిందావిడ.

ఏదో సంతలోకి అడుగుపెట్టానా అనిపించింది. ఆవిడ మాటల్లో వ్యాపార సరళి బాగా కనిపించింది. అందుకామెను తప్పుపట్టటం లేదు. ఇప్పటి పరిస్థితులలా వున్నాయ్ మరి కానీ యీ 'రేటు' నిర్ణయించుకోవటానికి ఆవిడ తన లెక్కల్లోకి తీసుకునే వివరాలు నాకు నచ్చలేదు. ఇవన్నీ చెప్పాక ఆవిడ—


'అన్నట్టు —పిల్లవాడు వెయ్యిపైనే సంపాదిస్తున్నాడని విన్నాం. అయిదారేళ్ళనుంచీ వుద్యోగంలో వున్నట్టున్నాడు ....బ్యాంకులో యెంత నిల్వవుంది? మనిషికి మూలధనం ముఖ్యం. చిన్న

యెకౌంటులో యెంతుంది? పెద్ద యెకౌంటులో యెంతుంది? ఆ యెకౌంట్ల పేర్లేవో నాకు తెలియవ్వు....మా అమ్మాయికి తెలుసు....దానికన్నీ తెల్సు' అంది.

నిరక్షరకుక్షులైన తల్లులు పిల్లల్ని తమతో పోల్చుకుని 'వాళ్ళకన్నీ తెల్సు' అంటూ వుంటారు. దాంతో పిల్లలు కూప స్థమండూకం మాదిరి తయారవుతారు.

తల్లి ఆ మాటలన్నప్పుడు ఆ అమ్మాయి తలుపు వెనకాల్నుంచి 'సేవింగ్సు డిపాజిట్. ఫిక్సెడ్ డిపాజిట్' అని అందించింది. ఈ పిల్ల తలుపు వెనకాలనుంచి యింతవరకూ రెండు మూడు తడవలు యిలాంటి సహాయాలే తల్లికి చేసింది. తల్లికిచేసిన సహాయం మాటెలావున్నా నాకుమాత్రం ఆ పిల్ల బాగా సహాయపడింది. ఆవు చేలో మేస్తుంటే దూడ గట్టున మేసేందు కవకాశం వుందన్న భ్రమ నా కప్పుడప్పుడు కలుగుతూవుంటుంది. ఈ భ్రమ కలిగించిన 'దూడలు' కొన్ని నాకు తటస్థపడ్డయ్ కూడాను. కానీ వాళ్ళందరూ యీ సిద్ధాంతానికి అతీతంగా వుండే చెదురు మదురు వ్యక్తులని అనిపించింది.

ఆవిడ వేసిన ఈ ప్రశ్నలలో నేనింక లేచి వెళ్ళిపోవచ్చు. అంటే పిల్లలా బ్యాంకు యెకౌంటుగురించి అడిగానని గాదు. మనుష్యులను కొలవటానికి నాకు కొన్ని పద్ధతులున్నట్టే వాళ్ళకీ వున్నయ్. అందుకు నేను ఫిర్యాదు చెయ్యను. నా పద్ధతే అందరూ అనుసరించాలని సిద్ధాంతీకరించటం కూడా నా పద్ధతికాదు. కానీ మారెండు పద్ధతులూ పరస్పర విరుద్ధమైనవి. వాటికి పొత్తు కుదరదు. అందుకనే నేనెప్పుడో నీ కాళ్ళకొక నమస్కారంపెట్టి లేచి వెళ్ళిపోవచ్చును. నమస్కారం పెట్టక కూడాలేకుండా యీ యింటికి రాకుండానే వెళ్ళిపోవచ్చును. కానీ నేను యిలా రావటానికి కారణం సంబంధం చూడాలని మాత్రమేకాదు. నేను అమలు పరిచే విధానం యెలాంటి ఫలితాల్నిస్తుందో తెల్సుకోవాలని. దాన్ని ఆచరణలో పెట్టటంలో అనుభవం సంపాదిద్దామన్న కోరికతోకూడా వచ్చాను. పరోక్షంగా వాళ్ళ వివరాలు విన్న నాకు నాపద్ధతి ప్రకారం వాళ్ళంటే వక అభిప్రాయం కలిగింది. ఆ అభిప్రాయం సరియైనదోకాదో ప్రత్యక్షంగా తెలుసుకుందామనే యింతసేపు కూర్చున్నాను. ఈమాత్రం దానికి వాళ్ళని యిబ్బంది పెట్టటంయెందుకని మీలో కొందరడగొచ్చు. మీ అభిప్రాయాన్ని త్రోసిపారెయ్యను. కానీ ఒక విషయం మనవి చేసుకోవాలి. కొందరు కాబోయే పెండ్లికొడుకులు ''ఆ....ఏంపోయింది? పిల్లని చూసిపోదాం....వాళ్ళుపెట్టేది మేసిపోదాం'' అన్న దృష్టిలో సంబంధాలు




చూస్తుంటే నేను పరిశోధకుడికి వుండే తృష్ణతో చూడటంలో తప్పులేదనే భావన నాకుంది. పరిశోధకులు తక్కువ సాక్ష్యంకంటే యెక్కువ సాక్ష్యం విలువైనదన్న వుద్దేశ్యంతో పరిశోధనలు అత్యధికంగా చేస్తూవుంటారు. ఆ వుద్దేశ్యంతోనే యీ యింటికొచ్చాను. వచ్చి లేచిపోకుండా యిప్పుడీ క్రింద చెప్పే ప్రశ్న వెయ్యటంలో కొంచెం స్వార్థం కూడా వుంది. ఆ సంగతి నా ప్రశ్న గురించి చెప్పాక చెప్పుతాను.

తలుపు చాటునవున్న పిల్ల బ్యాంకులో వేయ గల్గిన డిపాజిట్లను గురించి చెప్పాక నా మెదడు చురుకుగా పని చెయ్యటం మొదలు పెట్టింది. సుబ్రహ్మణ్యం "వెళదామా" అన్నట్లు నా ముఖంలోకి చూశాడు. నేను లేద్దామన్న ఆసక్తి కనపర్చక పోవటంతో ఆశ్చర్యంగా నా వంక చూశాడు. సుబ్రహ్మణ్యం ముఖంలోని విసుగు కనిపెట్టిన ఆవిడ—

"మరోలా అనుకోకండి.... తెల్సుకోవాలి గదా" అంది.

"అవునండి అక్కగారూ! తప్పకుండా తెల్సుకోవాల్సిందే. కానీ మా అబ్బాయిని "నీకు బాంకులో యెంతున్న" దని యింతవరకూ నే నెప్పుడూ అడగలేదు. రేపు ఒకవేళ నే నడిగినా ఆ డబ్బులో నాకేమన్నా యివ్వాల్సొస్తుందని సరయిన సమాధానం చెప్పుతాడో లేదో! ఈరోజు కుర్రకారింతేగదండీ; వాళ్ళ సరదాలు వాళ్ళవేగానీ పెద్దవాళ్ళ బాధలు, వాళ్ళపట్ల తమ బాధ్యతలు తెలియవ్

వాళ్ళకి .... అయినా వుత్తరం వ్రాసి ప్రయత్నిస్తాను" అన్నాను నవ్వుతూ.

ఇందులో నా స్వార్థం లేకపోలేదు. ఆవిడ పెంపకానికి పంపిన కుర్రవాడి డబ్బే అందుకుని యేదో యిల్లు కట్టుకుని కాలక్షేపం చేస్తోందికదా .... అలాంటివి యింతవరకూ నేను చదువు చెప్పిన మా అబ్బాయి నాకు సహాయంగా వుండటం పట్ల ఆవిడ వుద్దేశ్యం యేమిటో తెల్సుకుందామనే యీ విధంగా అన్నాను. సమాధానం నేనాశించినట్లే వచ్చింది.

"అబ్బే...మీరాశ్రమ తీసుకోకండి.... ఉత్తరం వ్రాయకండి .... ఏదో యథాలాపంగా అన్నాను" అంది.

ఇందులో నాకు శ్రమ తప్పిద్దామన్న కోరికకంటె నాకు మావాడి బ్యాంకెకౌంటెంతో తెల్సిపోతుందన్న ఆదుర్దా, భయం నాకు కనిపించినవి. పైగా నాకింతవరకూ దాన్సంగతి తెలియదని వొప్పుకొంటివి ఇంతవరకూ దాన్సంగతి తెలియని నాకు యిప్పుడు నాకు తెలిసేట్లు చెయ్యటం యెందుకా అని ఆవిడ మథన పడింది; తెలిసేట్టు చేసినట్టున్నానే అని బాధపడింది.

ఆవిడ బాధ చూస్తుంటే నాకో అనుమానం వచ్చింది. వాళ్ళింట్లోంచొచ్చి పెంపకాని కెళ్లాడని గుర్తుకొచ్చి నా అనుమానం అధికం కాసాగింది. నా అనుమానానికి ఆధారాలున్నయ్యో లేవో నాకు తెలియదు. ఆ వాతావరణం చూశాక మాత్రం నా అనుమానం కొట్టి పారవెయ్యటానికి వీలులేనిది అనిపించింది. ఆ యింట్లో ప్రతిచర్యనూ "డబ్బు మారక పట్టీ" అన్న అదృశ్యశక్తి నడిపిస్తున్నట్టు నాకు రూఢి అయ్యింది. ప్రతి పనికీ యెంత డబ్బు వస్తుందో తేల్చుకుగానీ చెయ్యరనిపించింది. లెక్కలపుస్తకంలో చివర్న వేస్తేను "టేబుల్సు" వున్నట్లు యిలాంటి పట్టీ యేదో వాళ్ళింట్లో వున్నట్టు తోచింది. ఇంతకీ నా అనుమానం యిది: తల్లిదండ్రుల కుండాల్సిన సహజ ప్రేమానురాగాల్ని వదిలేసుకుని, కొడుకుని యెక్కడో పెంపకానికిచ్చి తమ అంతస్తు పెంచుకున్నవాళ్ళు, రేపొద్దున కూతుర్నైత మావాడితో పెళ్ళిచేసి, విడాకు తెచ్చుకుని దాంతోబాటు వచ్చే "మనోవర్తి"తో తల్లీకూతుళ్లు తింటారా అన్నది నా అనుమానం. నేను మరీ అన్యాయంగా మాట్లాడుతున్నానని మీ కనుమానం రావచ్చు. మీరు కేకలు వెయ్యవచ్చును కూడాను. దానికి కారణం నేను కళ్లారా చూసిన పరిస్థితులు మీరు చూళ్ళేను; అంతే. పైగా తల్లీ—బిడ్డల అనుబంధం అన్ని బంధాలకన్నా అతీతమైనదని నా విశ్వాసం. దానినే తాకట్టు పెట్టగల్గిన వారికి భార్యాభర్తల సంబంధం వక లెక్కలోనిది కాదు.

"శుభం పలకరా పెళ్ళికొడకా ..." అంటే యేదో అన్నట్లుందని కూడా మీరు

నా మీద అభాండం వెయ్యవచ్చు. కానీ ఆమాటలన్నవాళ్లే "పెళ్ళి నూరేళ్ళపంట" అనికూడా అన్నారు అది మీరు మరచి పోయినా పిల్లవాడి తండ్రిగా నేను మాత్రం మరచిపోలేను. అందుకే లేచి బయటకు నడిచాను.

బయట కొచ్చాక సుబ్రహ్మణ్యంతో నా వుద్దేశ్యాలన్నీ చెప్పాను. అంతా విని సుబ్రహ్మణ్యం అన్నాడు.

"ఈ సంబంధానికి యిష్టపడక పోవటంలో అర్థంవుంది. ఈసంబంధాన్ని మీవాడికి తగినదని అనుకోకపోవటం నా బుద్ధి తక్కువ....కానీ యీ సంబంధాన్ని వ్యతిరేకించటానికి నువ్వు యిచ్చే కారణాలు సబబు గాలేవేమో....నీ దృష్టిలో పెంపకాని కెళ్ళేవాళ్ళందరూ డబ్బుమీద వ్యామోహంతోనే వెడుతున్నారనేనా? ఒక వంశాన్ని నిలిపేందుకు వెడుతున్నారని యెందుకనుకోవు?" అన్నాడు.

"ఎందుకనుకోను? లక్షణంగా అనుకుంటాను. కానీ నీమాదిరి "అలా చేసి వుంటారని యెందుకనుకోగూడదు" అని అనుకుని వాళ్ళని మెచ్చుకోను నాకు నిదర్శనం కావాలి. అదిగో.... దూరంగా చెట్టుక్రింద గుడ్డపరుచుకుని పడుకుంటే ఒక ముసలమ్మ....ఆమె కెవ్వరూలేరు. వంశం నిలవటం మాట దేవుడెరుగు! రేపద్దాకా ప్రాణం నిలుస్తుందో లేదో నమ్మకంలేదు. ఈ పెంపకాలకు వెళ్ళేవాళ్ళలో యేవక్కరయినా ఆమెకు పెంపకానికి వెళ్ళేందుకు యిష్టపడితే యీవిషయంలో నా వుద్దేశ్యాలన్నీ మార్చుకుంటాను" అన్నాను.

ఈ సంబంధం సుబ్రహ్మణ్యాని కెందుకు యిష్టంలేదో తెల్సుకుందామని అడిగాను.

"ఆడపిల్లవాళ్లు మగపిల్లవాడి డబ్బు గురించలా తెగబడి అడక్కూడదు" అన్నాడు సుబ్రహ్మణ్యం వాళ్లేదో ఘోరమైన అపకారం చేసినట్లు.

"మగపిల్లవాడి తరపువాళ్ళదగ్గరేంది వాళ్లెందుకడక్కూడదు? నీ నిర్ణయం వొప్పుకున్నాను కానీ ఆ నిర్ణయం తీసుకునేందుకు నువ్వుచెప్పే కారణం నాకు నచ్చలేదు" అన్నాను.

సుబ్రహ్మణ్యం యీ విషయం మాట చాలాసేపు మాట్లాడి నిన్నింకా వూదర కొట్టను లే అన్నట్టు—

"మనం యిప్పుడు కలుసుకోబోయేవాళ్లు పరవాలేదు" అన్నాడు.

పరవాలేదని చెప్పబడినాయన పేరు సీతారామయ్యగారు. మనిషిని చూసి మంచివాడని చెప్పలేం. కారణం ఆయనకు అనేకవిషయాల్లో కొన్ని నిశ్చితాభిప్రాయాలున్నట్లున్నయ్. అలాంటి వాళ్లు సామాన్యంగా కర్కోటకులుగా కనిపిస్తారు. వాళ్ళు నమ్మిన విషయాల్లో ఎదటివారి విభిన్నదృక్పథంతో వారు సామాన్యంగా వొప్పుకోరు. చూడటానికి యింతకుముందు వెళ్ళినయింట్లోని

మనుష్యులూ. యిక్కడి మనుష్యులూ ఒకమాదిరే వున్నారు. అందుకే నేననుకుంటాను సినిమాలలో మాదిరి మనుష్యుల ప్రవృత్తిని తెలియజేస్తూ ఆకారాలు, గదిలో అలంకారాలూ వుంటే బాగుండునని: విలన్ యింట్లో పులితల, పాలెగూళ్ళు వగైరాలూ, హీరో యింట్లో బుద్ధునిబొమ్మ వున్నట్లు నిత్యం మనం చూసే మనుష్యులుకూడా అలాంటివి అమర్చుకుంటే బాగుండును. కానీ సినిమా విలన్ హీరో అంత మంచి కాదట్టే హీరో బుద్ధునిబొమ్మ టేబిల్‌మీద పెట్టుకుంటే, తను పులిబొమ్మ వుంచుకుంటాడు. కానీ నిత్యం మనకు కనిపించే 'విలన్లు' సినిమా విలన్ కంటే క్రూరులు కాబట్టి వీళ్లుకూడా బుద్ధుని బొమ్మే పెట్టుకుంటారు. ఏమైనా సీతారామయ్యగారింట్లో వాళ్ళనిగురించి మనకు చూడగానే తెలిసేటట్లు యేమీ అమర్చుకోలేదు. పైగా యింట్లో కొన్ని చోట్ల పాలెగూళ్ళు కనిపించినయ్.

సీతారామయ్యగారు చూపించిన కుర్చీలో కూర్చుంటుండగా 'మేము....' అంటూ పరిచయం చెయ్యబోయాడు సుబ్రహ్మణ్యం. వాణ్ణి మాట్లాడనీయకుండా—

''మాది వరంగల్లు....నాపేరు రాఘవరావు, అయినా నేనొచ్చిన పనికి నా పేర్తో పనిలేదు. మీతో ఒక ముఖ్య విషయం మాట్లాడటానికొచ్చాం. మీరు మామీద దయవుంచి 'ఊ' అంటే ఒక వంశాన్ని నిలబెట్టారు'' అన్నాను.

సుబ్రహ్మణ్యం ముఖంలో ప్రశ్నార్థకాలు సీరియల్‌గా యింగ్లీషు సినిమాలో టైటిల్సు వచ్చినంత వేగంగానూ వచ్చేస్తున్నయ్ (అదేం ఖర్మో! నేనింగ్లీషు సినిమాల్లో వచ్చే టైటిల్సు ఒక్కసారీ పూర్తిగా చదవలేదు. ఒకటి చదవటం అవ్వకముందే మరోటొచ్చేసేది)


సీతారామయ్యగారు ఆశ్చర్యంగా నా వంక చూసి—

''మీరేం అంటున్నారో నాకు బోధపడటం లేదు ... నేను బడిపంతుల్ని; ఒక వ్యక్తిని నిలబెట్టే శక్తికూడా నాకుందని అనుకోను. మీరు వంశాన్నే నిలబెట్టమంటున్నారు. కొంచెం వివరంగా చెప్పండి'' అన్నారు.

''అయ్యా! మా దగ్గిర చుట్టం ఒకాయనున్నాడు. బోల్డు ఆస్తి; పిల్లల్లేరు. వాడికి మీ రెండో అబ్బాయిని పెంచుకోవాలన్న కోరిక కలిగింది. తమరు 'ఊఁ' అంటే...'' అని చెపుతూవుండగా ఆయన 'ఆపండి' అన్నట్టు మెల్లగా చెయ్యి ఊపాడు.

మాకు దగ్గిరలోనే నేలమీద కూర్చుని పదేళ్ళ కుర్రవాడొకడు వ్రాసుకుంటున్నాడు. సీతారామయ్యగారేం మాట్లాడలేదు... కొంచెంసేపాగి ఆయన—

''నాన్నా'' అంటూ క్రింద కూర్చున్న అబ్బాయిని పిలిచాడు. కుర్రాడు తండ్రి




దగ్గరగా వచ్చాడు. వాడి భుజంమీద చేయి వేస్తూ—

"నాన్నా!.... నువ్వు లోపలికి వెళ్ళు" అన్నాడు. వాడు వెళ్ళబోతూ వుండగా మళ్ళీ చెయ్యిపట్టుకుని ఆపాడు. పిల్లవాడి చెయ్యి పట్టుకుంటూండగా సీతారామయ్య గారి చెయ్యివంక చూశాను చెయ్యి కొంచెం వణుకుతున్నట్లుంది. పిల్లవాడి చెయ్యి గట్టిగా పట్టుకున్నాడు. ఆ పట్టులో పిల్లవాడు లక్షాధికారి కాబోతున్నాడన్న ఆనందం నాకు కనిపించింది.

"అక్కని కాఫీ తీసుకుని రమ్మన్నానని చెప్పు" అన్నాడు సీతారామయ్య గారు.

పిల్లవాడు లోపలికి వెళ్ళాడు. సీతారామయ్యగారు దారిలోకొస్తున్నట్టు నాకు తెలుస్తూనే వుంది. ఈయనను త్వరగా వదిలించుకోవా లనుకున్నాను.

సీతారామయ్యగారేం మాట్లాడలేదు. ఇరవయ్యేళ్ళమ్మాయి కాఫీ కప్పులు పట్టుకుని గదిలోకొచ్చింది.

"పిల్ల బాగుంది.... ఈ యింట్లో గాక మరొకచోట తారసిల్లితే బాగుండేది" అనుకున్నాను.

"మీ అమ్మాయేనా?" అన్నాను.

నా వంక విశితంగా చూస్తూ "కాఫీ పుచ్చుకోండి" అన్నాడు సీతారామయ్య గారు.

కాఫీ త్రాగాక సంభాషణ కొనసాగించాలనే ఉద్దేశ్యంతో—

"తమరి అభిప్రాయం...." అంటూ సాగదీశాను.

"తమరిని మా యింటి కెవ్వరు పంపారో నాకు తెలియదు. నా గురించి

సుబ్రహ్మణ్యంగారికి బాగా తెలుసు.... వారి పని చేసివుంటారని నేననుకోను ఇక పోతే మీరు నాకు అపరిచితులు. మీతో అధిక ప్రసంగం చేయటం నా కిష్టంలేదు. నేను శలవు తీసుకుంటాను .. బజార్లో కొంచెం పనుంది" అన్నాడు సీతారామయ్యగారు కుర్చీలోంచి లేస్తూ.

నేను సీతారామయ్యగారివంక నవ్వుతూ చూశాను

"బుద్ధి లేకపోతే సరి...." అంటూ సుబ్రహ్మణ్యం సణుక్కుంటున్నాడు.

"బావగారూ! మీరు నన్ను క్షమించాలి. వెయ్యి అబద్ధాలాడి ఒక పెళ్ళి చెయ్యమన్నారు. ఎవరన్నారో యెవ్వరికీ తెలియదు గానీ యిప్పుడందరూ చేసేపని అదే. పిల్లవాడు బి.కాం. చదువుతుంటే ఎం.కాం. అని అబద్ధాలాడేవాళ్ళున్నారు. పిల్ల వయస్సు పాతికయితే "అబ్బే ... మీ రొచ్చేముందే ఇరవై వెళ్ళనయ్' అనేవాళ్ళున్నారు; అవతల పిల్లవాడికి యిరవై నాలుగని తెలిసినా యీమాట అనటానికి వెనకాడనివాళ్ళున్నారు. నేనా పనేం చెయ్యలేను. నే నొచ్చిన పని విషయంలో అబద్ధం చెప్పాను. నే నొచ్చిన అబద్ధపు పనికి మీ రంగీకరించలేదు. అందుకు నేను చాలా సంతోషిస్తున్నాను. ఇక నేను నిజంగా యిక్కడ కొచ్చినపని యేమిటంటే మీ అమ్మాయిని మా యింటి కోడలుగా చేసుకునేందుకు. నాపేరు రామమూర్తి. నా గురించి మా సుబ్రహ్మణ్యం మీకు చెప్పేవుంటాడు. నే నొచ్చిన యీ విషయంలో మీ రంగీకరించకపోతే నేను బాధపడతాను."

"ఖర్చు చేసేందుకు డబ్బు కావాలి. అయినా మనిషికున్న మరి కొంత ఆస్తిని ఖర్చు చేసుకుంటే గానీ డబ్బు రాదు. శారీరక మానసిక శక్తులను ఖర్చు పెట్టుకుంటూ వ్యక్తిత్వాన్ని, మానవత్వాన్ని నిలజేసుకుంటూ డబ్బు సంపాదించేవారున్నారు. వాళ్ళు ఉత్తములు. శారీరక మానసిక శక్తులతోబాటు వ్యక్తిత్వాన్ని, పరువునూ ఖర్చుచేసి డబ్బు సంపాదించే వాళ్ళున్నారు. వాళ్ళు ప్రస్తుతపు పరిస్థితుల్లో మధ్యములుగా చలామణీ అవుతున్నారు. సహజమైన ప్రేమానురాగాల్ని, మానవత్వాన్ని ఖర్చుచేసి డబ్బు గడించే వాళ్ళున్నారు. వీరు నీచులు.

"డబ్బుకన్నా ఖరీదుంది. చేర్చిన డబ్బునిబట్టి గాక దానికి చెల్లించిన ఖరీదునిబట్టి మనిషికి విలువగట్టడం నా కలవాటు. మీకో అమ్మాయి వుందని మా సుబ్రహ్మణ్యం చెప్పాడు. మా సంగతులూ మీకు చెప్పేవుంటాడు. అందుకే వచ్చాను. మీరు "ఊఁ" అంటే ఆనందంగా వెడతాను" అన్నాను.

సీతారామయ్యగారు నిండుగా నవ్వారు. నేనూ మనసారా నవ్వాను. మా సుబ్రహ్మణ్యం కూడా నవ్వుతూ "మా వాడికి వేపకాయంత వెర్రి వుందలెండి" అన్నాడు.